# రోడ్లే వడ్ల కళ్లాలు



- ప్రతి ఏటా ఇవే తిప్పలు
- కాంటాలు, లారీల్లోకి లోడింగ్ సైతం రోడ్లపైనే..
- వర్షాలొస్తే తడిసి నష్టపోతున్న అన్నదాతలు
- గ్రామీణ మార్కెట్ల నిర్మాణం పట్టని పాలకులు
- తరచూ ప్రమాదాలు.. రాకపోకలకు ఇబ్బందులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏడాదికి రెండు సీజన్లలో పండించే వరి ధాన్యాన్ని అమ్ముకోవడం రైతులకు ఓ కత్తిమీద సాములా మారింది. దాంతో పండిన పంటల్ని కొనుగోలు చేయడమే కాకుండా మార్కెట్ల సదుపాయమూ కల్పించాలని రైతులు కోరుతున్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ ఆరుబయటే నిర్వహిస్తున్నారు. చెల్క భూములన్నీ సాగు భూములవ్వడంతో ధాన్యాన్ని ఆరబోసి శుద్ధి చేసేందుకు స్థలాల్లేక రైతులు రోడ్లనే వడ్ల కళ్లాలుగా వాడుకోవాల్సి వస్తోంది.

యాసంగి సీజన్ వరి ధాన్యం సేకరణ షురూ అయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా 56.69 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. రైతులు తమ అవసరాలకు పోగా మిగిలిన ధాన్యాన్ని మార్కెట్లకు తీసుకొస్తే దాన్నంతా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం 8200 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట ఇతర జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలోనూ 7.22 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 1113 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. యాసంగిలో తరచూ అకాల వడగండ్ల వానలు కురుస్తున్నాయి. పంట కోత దశల్లో కొంత నష్టపోయింది. ప్రస్తుతం ధాన్యం తడుస్తుండటంతో ఇంకొంత నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

**మార్కెట్ స్థలాల్లేక రోడ్లే కళ్లాలు**

రైతులు పండించిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం.. ఐకెపి, పిఎసిఎస్, డిసిఎంఎస్ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. వాటి ద్వారా రైతులు తెచ్చిన ధాన్యాన్ని కాంటా వేసి కొనుగోలు చేస్తున్నారు. ఇంత వరకు సవ్యంగానే సాగుతున్నా ధాన్యం తేమ లేకుండా ఆరబోయడం, తాలు, చెత్త లేకుండా తూర్పార పట్టడం, కాంట వేసే వరకు రాసి పోయడం కోసం స్థలాల్లేవు. పైరును వరి కోత మిషన్ కోసి ధాన్యాన్ని ట్రాక్టర్ ట్రక్‌లో పోస్తుంది. ఆ ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి రాసి పోసుకోవాలి. 17 శాతం తేమ వరకు ఉండేట్టుగా ఎండబెట్టేందుకు ఆరబోయాలి. అందుకోసం ఎక్కడా స్థలాల్లేకపోవడంతో రైతులకు రోడ్లే వడ్ల కళ్లాలయ్యాయి. తమ పొలాల సమీపంలో ఉన్న రోడ్లపైనే రైతులు ధాన్యం కుప్పలు పోస్తున్నారు. వీలును బట్టి రోడ్డు పొడవునా ఆరబోస్తున్నారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట మూడు జిల్లాల్లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ కోసం స్థలాలు లభించడంలేదు. గతంలో స్కూల్స్ ఇతర ఖాళీ స్థలాల్లో కేంద్రాలను నిర్వహించారు. ప్రస్తుతం అవి కూడా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఎక్కడ ధాన్యం పోస్తే అక్కడికే వెళ్లి కాంటా వేసి లారీల్లో లోడ్ ఎత్తుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఉన్న హైదరాబాద్-ముంబయి, హైదరాబాద్-నాందేడ్ జాతీయ రహదారుల పైన కూడా రైతులు ధాన్యం ఆరబోస్తున్నారు. జోగిపేట-మెదక్ రోడ్డు, నర్సాపూర్-మెదక్, మెదక్-రామాయంపేట, జనగాం-సిద్దిపేట, పటాన్‌చెరు-జిన్నారం, బొడమటిపల్లి-మెదక్ ఇలా చిన్న, పెద్ద, మధ్య తరహా రోడ్లన్నీ కూడా ధాన్యం రాసులతో నిండిపోయాయి. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు సైతం రైతులు రోడ్లపైన పోసిన ధాన్యాన్ని కాంటా వేసి అక్కడే లారీలు పెట్టి లోడ్ నింపుతున్నారు.

**గ్రామీణ మార్కెట్లను నిర్మించాలి**

రైతులు పండించిన పంటల్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడంతో పాటు ఆహార ధాన్యాల నిల్వల్ని పెంచడం కోసం గ్రామీణ మార్కెట్లు, గోదాముల్ని నిర్మాణం చేయాలి. ఇది ప్రభుత్వాల బాధ్యత. కానీ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదు. రియల్ ఎస్టేట్, సాగు విస్తీర్ణం పెరిగిన తర్వాత గ్రామాల్లో ఖాళీ స్థలాలుండటంలేదు. ఒకటి లేదా రెండు గ్రామాలకు కలిపి ఒక ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఆ గ్రామాల్లో మార్కెట్ నిర్వహణ కోసం అవసరమైన స్థలం ఉండట్లేదు. ఎక్కడో ఒక చోట ఖాళీ స్థలాలున్నా బండరాళ్లు, చెట్లపొదలతో నిండి ఉన్నాయి. వాటిని చదును చేసి ధాన్యం కుప్పలు, ఆరబోయడం కోసం, కాంటా వేసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అవసరమైన షెడ్లు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. గత ప్రభుత్వం గ్రామీణ గోదాములు, మార్కెట్ల ఏర్పాటుకు నిధులు కేటాయించింది. మార్కెట్ల కోసం భూ సేకరణ చేసినా అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఆలాంటి ఆలోచన చేయట్లేదు.

**తరచూ ప్రమాదాలు, వాహనాల రాకపోకలకు తిప్పలు**

రోడ్లపై ధాన్యం కుప్పలు, ఆరబోయడం వల్ల సింగిల్ రోడ్లపైన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలో రోడ్లపైన వడ్ల రాసులు పోయడం వల్ల ఒక బైక్, ట్రాక్టర్ ప్రమాదం జరిగి ఇద్దరు మృతి చెందారు. ఇతర ప్రాంతాల్లోనూ గాయాలపాలయ్యారు. వడ్లపైన బైక్‌లు నడపడం వల్ల స్కిడ్ అయి కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. ధాన్యం ఆరబోయడం, కుప్పలు చేయడం వంటి పనుల్లో రైతు కూలీలుండటంతో వాహనాలు ఢీకొనే ప్రమాదముంది.



## సింగరేణి మహిళా కళాశాల స్వర్ణోత్సవ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి కాలరీస్ సంస్థ కొత్తగూడెంలో తొలి మహిళా కళాశాలను ప్రారంభించి ఈ ఏడాదితో 50 ఏండ్లు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ రూపొందించిన గోల్డెన్ జూబ్లీ లోగోను ఆ సంస్థ సిఎండి ఎన్ బలరాం బుధవారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి వర్చువల్‌గా ఆవిష్కరించారు. మహిళా విద్యకు అంకితమై, ఐదు దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఆ కళాశాల మరింత వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎల్‌వి సూర్యనారాయణ, కె వెంకటేశ్వరు, సిపిపి ఏ మనోహర్, కొత్తగూడెం నుంచి సింగరేణి విద్యాసంస్థల కార్యదర్శి గుండా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మాల్ పంచాయతీకి జాతీయ అవార్డు

- నేడు ప్రధాని నరేంద్ర మోడీ నుండి అవార్డు
- ఏటా రూ.90 లక్షల ఆదాయాన్ని ఆర్జిస్తున్న మాల్
- మంత్రి సీతక్క హర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మాల్ గ్రామ పంచాయతీ ఆత్మనిర్భర్ పంచాయతీ విభాగంలో జాతీయ అవార్డును కైవసం చేసుకోవడం పట్ల పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులను సమీకరించుకుని సాధికారతకు, స్వయం సమృద్ధికి నిర్వచనంగా మారడటం పట్ల గొప్ప విషయమని పేర్కొన్నారు. మాల్ పంచాయతీ ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేసిన అధికారులను మంత్రి అభినందించారు. మాల్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి గ్రామపంచాయతీ కూడా ఎదగాలని ఆకాంక్షించారు. బీహార్‌లోని మధుబనీలో గురువారం జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా అవార్డును జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, జిల్లా పరిషత్ సిఇఒ కృష్ణారెడ్డిలతో కూడిన అధికారుల బృందం అవార్డు అందుకోనుంది. ఈ అవార్డు కింద ఆ పంచాయతీకి కోటి రూపాయల ప్రోత్సాహక బహుమతి లభించనున్నది. ప్రభుత్వ నిధుల మీద ఆధారపడకుండా సొంత ఆదాయ వనరులను మాల్ గ్రామపంచాయతీ సమకూర్చుకుంది. రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల కూడలిలో ఉన్న మాల్ గ్రామం ఏడాదికి రూ.90 లక్షల వరకు ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

**జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ శుభాకాంక్షలు**

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజానీకానికి మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పంచాయతీ రాజ్ వ్యవస్థకు చట్టబద్ధత కల్పించిన సందర్భాన్ని గుర్తు చేస్తూ ప్రతి ఏటా ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు. రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా, 73వ రాజ్యాంగ సవరణ కనుగుణంగా గ్రామ పంచాయతీలకు విధులు, నిధులు అప్పగించే దిశలో తమ ప్రజాప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. గ్రామపంచాయతీల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛదనం- పచ్చదనం, పల్లెల్లో పనుల జాతర వంటి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసినట్టు తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థకు మూల కేంద్రంగా ఉన్న గ్రామ సభల ద్వారానే సంక్షేమ పథకాల లబ్దిదారుల ఎంపిక జరుగుతున్నదని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియ కారణంగా ఆలస్యమైన పంచాయతీ ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామని వెల్లడించారు.



## రజతోత్సవ సభను విజయవంతం చేసుకుందాం

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు బిఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) కోరారు. బుధవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో ఈ నెల 27న నిర్వహించనున్న రజతోత్సవ సభ ప్రాంగణాన్ని నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ముందుగా కాశ్మీర్‌లో టెర్రరిస్టుల దాడిలో మృతిచెందిన టూరిస్టులకు సంతాపం తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కెసిఆర్ నాయకత్వంలో 24 ఏండ్ల క్రితం 2001 ఏప్రిల్ 27న ఉద్యమ సంస్థగా ఏర్పడిందన్నారు. దేశంలో ఎన్నో పార్టీలు పుట్టి కనుమరుగయ్యాయని, కానీ బిఆర్ఎస్ 24 ఏండ్లు పూర్తిచేసుకొని ముందుకు పోతున్నదని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో నిలదొక్కుకున్నవి రెండే రెండు పార్టీలని.. ఒకటి.. ఎన్‌టిఆర్ నాయకత్వంలో తెలుగుదేశం, రెండోది ఉద్యమ నాయకుడు కెసిఆర్ ఏర్పాటు చేసిన టిఆర్ఎస్ అని అన్నారు.

## ఆ జాబితా నిజం కాదు

- టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సోషల్ మీడియాలో ప్రచారవుతున్న పార్టీ కార్యవర్గ జాబితా నిజం కాదని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. టిపిసిసి కార్యవర్గం, డిసిసి అధ్యక్షుల ప్రతిపాదనల పేరుతో సామాజిక మాధ్యమంలో ప్రచారంలో ఉన్న వాటిని నమ్మొద్దని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాంటి ప్రతిపాదనలు, లిస్టులు ఇంకా టిపిసిసి చేయలేదని స్పష్టం చేశారు. అందుకోసం క్షేత్ర స్థాయి సంప్రదింపులు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## సిఎం జపాన్ పర్యటనతో నిరుద్యోగులకు వరం

- టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటన నిరుద్యోగ యువతకు ఓ వరమని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ చెప్పారు. రాష్ట్ర నిరుద్యోగులకు భవిష్యత్తులో 35 వేల ఉద్యోగాలు వచ్చేలా సిఎం చేసిన కృషి చారిత్రాత్మకమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 17 నెలల నుంచి నిరుద్యోగుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్నదని తెలిపారు. ఒకవైపు ప్రభుత్వ రంగంలో ఒక్క ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ జరిగిందని పేర్కొన్నారు. 20 వేల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం శుభాపరిణామని తెలిపారు. జపాన్ దేశంతో రూ.12 వేల కోట్ల అభివృద్ధితో తెలంగాణ యువతకు 30,500 ఉద్యోగాలకు అవకాశం రావడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్ ఎకోటౌన్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని వివరించారు. మూసీ ప్రక్షాళనతోపాటు ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో దేశంలోనే అతిపెద్ద అభివృద్ధి చెందే రాష్ట్రంగా తెలంగాణ మారుతోందని ఆయన ఆకాంక్షించారు.




కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

## ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రజలు నిలబడాలి

- అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజలు నిలబడాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఎయిప్సో) పిలుపునిచ్చింది. బుధవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో సంఘం కార్యాలయం వద్ద నాయకులు ఫహల్గాం వద్ద టెర్రరిస్టుల దాడిని ఖండిస్తూ, మరణించిన వారికి నివాళి ఘటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి కొవ్వొత్తులతో నివాలులర్పించారు. ఈ సందర్భంగా ఐఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, ఎయిప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెపిఎల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు జి.నాగేశ్వరరావు, కాచం సత్యనారాయణ మాట్లాడారు. ఉగ్రవాదం చాలా ప్రమాదకరమనీ, దేశ సార్వభౌమాధికారాన్ని, ప్రగతిని, మానవ హక్కులను హరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఉగ్రదాడుల్లో అమాయక ప్రజలు మరణిస్తున్నారనీ, వీటికి అడ్డుకట్ట వేసేందుకు పాలకులు అన్ని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆధార్‌లాగా భూధార్

- మోసాలకు అతీతంగా 'భూ భారతి'
- మంత్రి పొన్నం ప్రభాకర్
- సిద్దిపేట జిల్లా కోహెడలో అవగాహనా కార్యక్రమం

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

ధరణిలో జరిగిన మోసాలకు అతీతంగా నిలిచేదే భూ భారతి చట్టం అని బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్ధిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన కొత్త ఆర్ఒఆర్ చట్టం భూ భారతిపై అవగాహనా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ధరణితో ఇబ్బందులు పడుతున్నారని లక్షల మంది పిటిషన్ పెట్టుకున్నప్పటికీ వాటిని పరిష్కరించలేకపోయారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన విధంగా కొత్తగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, దీనిద్వారా అర్హులైన హక్కుదారులకు పూర్తి చట్టభద్రత కల్పిస్తామని తెలిపారు. ప్రతి మండలంలో భూ భారతిపై అవగాహనా కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ఎవరైన ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే.. వాటిని రద్దు చేయాలని తెలిపారు. ఈ చట్టం అమలు ద్వారా గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు లేకుండా హద్దులతో సహా అన్ని రకాల భూ వ్యవస్థను ఒక పద్ధతిగా నిర్వహించడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. అంతకుముందు సన్నబియ్యం కార్యక్రమంలో భాగంగా తలారి చంద్రయ్య ఇంట్లో భోజనం చేసి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంథాల చైర్మెన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మెన్ బోయిని నిర్మల జయరాజ్, ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

- ఓటింగ్‌కు దూరంగా బిఆర్ఎస్
- భారీ బందోబస్తు మధ్య కొనసాగిన పోలింగ్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

జిహెచ్ఎంసి లోకల్ బాడీ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం హైదరాబాద్‌లోని జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యుల కోసం వేర్వేరుగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం చుట్టూ కట్టుదిట్టంగా ఆంక్షలు అమలు చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 4 గంటలకు పూర్తయింది. బిజెపి ఎంపిలు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, డాక్టర్ కె.లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తొలుత పోలింగ్ బూత్ నెంబర్ 1లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ తర్వాత ఎంఐఎం హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఓవైసీ, మాజీద్ హుస్సేన్, కౌసర్ మోహియుద్దీన్, ముంతాజ్ ఖాన్, మిరాజ్ జాఫర్ హుస్సేన్, మహ్మద్ ముబిన్, అహ్మద్ బిలాలా ఓటు వేశారు. అధికార కాంగ్రెస్ ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ప్రస్తుత లోకల్‌బాడీ



ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్‌తో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి పోలింగ్ బూత్ నెంబర్ 2లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే, టిజెఎస్ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ఓటు వేశారు. మధ్యాహ్నం వరకు ఎంఐఎం కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గోషామహల్ బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ పోలింగ్ బూత్ వన్‌లో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఓటు వేశారు.

**పది గంటలకల్లా 37.51 శాతం ఓటింగ్**

ఉదయం పది గంటల కల్లా 37.51 శాతం ఓట్లు నమోదయ్యాయి. పన్నెండు గంటల వరకు 80శాతం ఓటింగ్ పూర్తయింది. మధ్యాహ్నం రెండింటి వరకు కాంగ్రెస్, బిజెపి, ఎంఐఎం పార్టీల కార్పొరేటర్లు 66 మంది, ఆయా పార్టీలకు చెందిన 22 మంది ఎక్స్ అఫిషియో సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 4 గంటలకల్లా 78.57 శాతం పోలింగ్ నమోదైంది. బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు.

**ఎంఐఎం విజయం ఖాయమే..!**

జిహెచ్ఎంసి లోకల్‌బాడీ స్థానం పరిధిలో అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు బిఆర్ఎస్, ఎంఐఎం, బిజెపి పార్టీకి చెందిన కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులతో కలిపి మొత్తం 112 మంది ఓటర్లున్నారు. వీరిలో 50 మంది ఓటర్లు ఎంఐఎం పార్టీకి చెందిన వారే. పోలైన ఓట్లలో సగానికి ఒక ఓటు అదనంగా వచ్చిన అభ్యర్థి విజయం సాధించినట్టేనని అధికారులు వెల్లడించిన నేపథ్యంలో ఓటింగ్‌కు దూరంగా ఉన్న బిఆర్ఎస్ పార్టీకి చెందిన 24 మంది ఓటర్ల మినహా మిగిలిన 88 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో దాదాపు 50కిపైగా ఓట్లు మజ్లీస్ అభ్యర్థికి పడినట్టు సమాచారం. దాంతో ఈ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ విజయం లాంఛనమేనని తెలుస్తోంది. సుమారు 22 ఏండ్ల తర్వాత లోకల్ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరిగింది. అంతకు ముందు ఈ స్థానం ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈసారి పోలింగ్, కౌంటింగ్ అనివార్యమైంది.

## సింగరేణి జనరల్ మజ్దూర్ల హోదా మార్పు

- జనరల్ అసిస్టెంట్స్‌గా గుర్తింపు
- 14 వేల మంది కార్మికులకు వర్తింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సింగరేణి కాలరీస్ కేటగిరి-1లో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్లను ఇకపై ఆ పేరుతో కాకుండా, జనరల్ అసిస్టెంట్స్‌గా డిజిగ్నేషన్ (హోదా) మారుస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన జాతీయ స్థాయి వేజ్ బోర్డు ఒప్పందంలో ఈ పేరు మార్పునకు సంబంధించి నిర్ణయం తీసుకున్నారు. తక్షణం డిజిగ్నేషన్ మార్పును అమల్లోకి తెస్తామని సింగరేణి సిఎండి ఎన్ బలరాం హామీ ఇచ్చారు. దానిలో భాగంగా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయం వల్ల జనరల్ మజ్దూర్ అనే పేరు ఇకపై కనుమరుగవుతుందనీ, 14 వేల మంది కార్మికులకు ఇది వర్తిస్తుందని అధికారులు తెలిపారు. ఈ నిర్ణయం పట్ల కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

**ఇదీ నేపథ్యం**

మజ్దూర్ అంటే హిందీలో కార్మికుడు, కూలి అని అర్థం. సింగరేణి సంస్థతో పాటు కోల్ ఇండియాలో కూడా కింది స్థాయి ఉద్యోగులను ఇదే పేరుతో పిలుస్తున్నారు. బొగ్గు తవ్వకం తొలి రోజుల్లో గుత్తేదారులే యజమానులుగా ఉండేవారు. బొగ్గు తవ్వడం కోసం పల్లె ప్రాంతాల నుంచి కూలీలను (మజ్దూర్) తీసుకొస్తుండేవారు. కాలక్రమంలో బొగ్గు గనులు జాతీయకరణ జరిగిన తర్వాత ఈ మజ్దూర్లను అన్ని రకాల శారీరక శ్రమకు సంబంధించిన పనులకు వినియోగిస్తుండేవారు. వీరిని జనరల్ మజ్దూర్‌లుగా గుర్తించారు. గతంలో కేవలం నిరక్షరాస్యులు మాత్రమే జనరల్ మజ్దూర్లుగా పనిచేస్తుండేవారు. కానీ ప్రస్తుతం కారుణ్య నియామకాల్లో ఉన్నత చదువులు చదివిన వారు కూడా తొలుత బదిలీ వర్కర్లుగా ఎంపికై, ఏడాది తర్వాత జనరల్ మజ్దూర్లుగా గుర్తింపబడుతున్నారు. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో జనరల్ మజ్దూర్లు కూడా కీలకంగా కావడంతో, వీరి వృత్తికి కూడా సముచిత గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో జనరల్ మజ్దూర్ పేరును తొలగించి జనరల్ అసిస్టెంట్‌గా మార్పు చేశారు.

**కాలేయ జబ్బున్న కార్మికులకు సగం జీతంతో ప్రత్యేక సెలవు**

తీవ్ర కాలేయ వ్యాధి (లివర్ సిరోసిస్) బారిన పడిన సింగరేణి కార్మికులకు 50 శాతం వేతనంతో ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు గుండె జబ్బు, క్షయ, క్యాన్సర్, కుష్టు, పక్షవాతం, మూత్రకోశ వ్యాధులు, ఎయిడ్స్, మెదడు వ్యాధులుకు ఈ ప్రత్యేక సెలవులు ఇస్తున్నారు. ఇటీవల కోల్ ఇండియాలో నేషనల్ కోల్ వేజ్ అగ్రిమెంట్ (ఎన్సీడబ్ల్యూఏ) ఒప్పందంలో లివర్ సిరోసిస్ (తీవ్ర కాలేయ వ్యాధి) బాధితులకు కూడా స్పెషల్ లీవ్ వర్తింపచేయాలని నిర్ణయించారు. దీనితో సింగరేణి యాజమాన్యం ఆ మేరకు నిర్ణయం తీసుకొని, ఉత్తర్వులు జారీ చేసింది. తీవ్ర కాలేయ వ్యాధికి గురైన కార్మికునికి స్పెషల్ లీవు మంజూరు చేయవచ్చునీ, వ్యాధి నయమై, విధులకు ఫిట్ అయ్యేంతవరకు అతనికి 50 శాతం వేతన మొత్తం (బేసిక్ పే, వీడిఏ, ఎస్‌డీఏలో 50 శాతం) చెల్లించవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంస్థ సీఎండీ ఎన్ బలరాం ఆదేశాల మేరకు జీఎం పర్సనల్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

## సరికొత్తగా హైడ్రా లోగో

- ఈసారీ బతుకమ్మ కుంటలోనే బతుకమ్మలు
- అభివృద్ధి పనులను ప్రారంభించిన హైడ్రా కమిషనర్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) తన కొత్త లోగోను విడుదల చేసింది. నీటిబొట్టుతో సరికొత్తగా లోగోను బుధవారం విడుదల చేసింది. ఇప్పటి వరకు ఇవిడిఎం లోగోనే హైడ్రా వినియోగిస్తూ వచ్చింది. అయితే ఇప్పుడు కొత్తగా జలవనరుల శాఖను పోలి ఉండేలా హైడ్రా లోగోను రూపొందించారు. హెచ్ అక్షరంపై నీటి బొట్టుతో లోగోను రూపకల్పన చేశారు. హైడ్రా కార్యాలయం, వాహనాలు, సిబ్బంది యూనిఫాంపై కూడా కొత్త లోగో వేస్తారు. అలాగే, హైడ్రా అధికారిక ఎక్స్(ట్విట్టర్) అకౌంట్‌కు కొత్త లోగోను ప్రొఫైల్ పిక్చర్‌గా పెట్టారు.

**బతుకమ్మ కుంటలో అభివృద్ధి పనులు**

బతుకమ్మ ఉత్సవాల నాటికి బతుకమ్మ కుంటను సిద్ధం చేస్తామని హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ తెలిపారు. బతుకమ్మ కుంటకు సంబంధించిన కోర్టు వివాదం మంగళవారం పరిష్కారమైందన్నారు. హైడ్రా కమిషనర్ బుధవారం అంబర్‌పేట బతుకమ్మ కుంటను సందర్శించారు. స్థానికుల సమక్షంలో అక్కడ అభివృద్ధి పనులను ప్రారంభించారు. యుద్ధ ప్రాతిపదికన ఈ చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి, సుందరీకరణ పనులు జరగాలని అధికారులను ఆదేశించారు. చెరువును పునరుద్ధరిస్తే పరిసరాలన్నీ ఆహ్లాదకరంగా మారుతాయన్నారు. పనులకు సహకరించాలని స్థానికులను కోరారు. అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందిస్తామని స్థానికులు కమిషనర్‌కు హామీ ఇచ్చారు

## ఉపాధి పని దినాల కుదింపు చట్ట వ్యతిరేకం

- కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలి
- అన్యాయంపై కేంద్ర మంత్రులు, బిజెపి ఎంపిలు నోరు విప్పాలి : వ్యకాస

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పని దినాలను 6.5 కోట్ల తగ్గించడాన్ని వెనక్కి తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం పోరాడాలనీ, వెనక్కి తీసుకునేలా ఒత్తిడి తీసుకొచ్చేలా పోరాట కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఉపాధి పనుల కేటాయింపులో తెలంగాణ పేద ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, బిజెపి ఎంపిలు నోరు విప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వలన తెలంగాణ 1.5 కోట్ల పని దినాలను కోల్పోతుందనీ, లక్షలాది కుటుంబాలు పని కోసం ఇతర ప్రాంతాలకు వలసబోయే ప్రమాదం ఏర్పడుతుందని వాపోయారు. గ్రామీణ ప్రాంతాల్లో పనుల కోసం వలసలు వెళ్లే వారిని నిలవరించడం కోసం గ్రామీణ ఉపాధి హామీ చట్టం 100 రోజుల పనిని గ్యారెంటీ చేసిందని గుర్తుచేశారు. ఈ మౌలిక ఉద్దేశానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేయడం దుర్మార్గమైన చర్య అనీ, కేంద్రంలో ఎన్‌డిఎ సర్కారు అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఒక పథకం ప్రకారమే గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. దేశవ్యాప్తంగా కొత్త జాబ్ కార్డులను ఇవ్వట్లేదనీ, బడ్జెట్‌లో దానికి నిధుల్లో కోత పెడుతున్నదని ఎత్తిచూపారు.ఉదయం, సాయంత్రం పూటల్లో ఆన్‌లైన్ మస్టర్ తప్పనిసరి చేయడం, ఆధార్ కార్డు బ్యాంక్ అకౌంటుతో లింకు, ఉపాధి జాబ్ కార్డు నంబర్ల ఆన్‌లైన్ పేరుతో కోట్లాదిమంది పేదలను ఉపాధి పనికి దూరంగా నెట్టివేయబడుతున్నారని వాపోయారు. ఉపాధి హామీ కూలీలుగా దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల వారే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. అలాంటి వారి పొట్టగొట్టాలని బీజేపీ సర్కారు చూడటం దుర్మార్గమని పేర్కొన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## హైదరాబాద్‌లో మరో సుబా గ్రూపు హోటల్ ప్రారంభం

హైదరాబాద్ : దక్షిణాది విస్తరణలో భాగంగా సుబా గ్రూప్ హైదరాబాద్‌లో తన క్లిక్ హోటల్‌ను ప్రారంభించింది. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి 10 నిమిషాల దూరంలో దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. విమానాశ్రయ ప్రయాణికులు, వ్యాపారవేత్తలకు ఈ హోటల్ సౌలభ్యంగా ఉంటుందని సుబా గ్రూప్ ఆఫ్ హోటల్స్ ఎండి మన్సూర్ మెహతా, సిఇఒ ముబీన్ మెహతా తెలిపారు. నగరంలో ఇది తమకు మూడో హోటల్ అని తెలిపారు. క్లిక్ హోటల్‌లో 62 గదులు, సూట్‌లు, మల్టీ క్యూసిన్ రెస్టారెంట్‌తో అందుబాటులోకి తెచ్చామన్నారు.



స్టోర్‌ను ప్రారంభిస్తున్న స్వదేశ్ కుమార్

## రెండు తనిష్క్ కొత్త స్టోర్‌ల ఏర్పాటు

హైదరాబాద్ : నగరంలోని సన్‌సిటీ, కోకాపేటలో టాటా గ్రూపునకు చెందిన భారతదేశపు అతిపెద్ద ఆభరణాల రిటైల్ బ్రాండ్ అయిన తనిష్క్ రెండు కొత్త స్టోర్‌లను ఏర్పాటు చేసింది. సన్‌సిటీ స్టోర్‌ను తనిష్క్ చీఫ్ పీపుల్ ఆఫీసర్ స్వదేశ్ కుమార్ బెహెరా, సౌత్ రీజినల్ బిజినెస్ హెడ్ అజయ్ ద్వివేది లాంఛనంగా ప్రారంభించారు. 7500 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని అందుబాటులోకి తెచ్చింది. తమ వినియోగదారులకు అసాధారణమైన సేవలను అందించడానికి అంకిత భావంతో ఉన్నామని అజయ్ ద్వివేది పేర్కొన్నారు.

## స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలి

- మోకాళ్లపై కూర్చొని డాక్యుమెంట్ రైటర్ల అర్ధనగ్న నిరసన

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

కొత్తగా ప్రవేశపెడుతున్న స్లాట్‌బుకింగ్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని చేర్యాల డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సిద్ధిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని అర్ధనగ్న నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయం వద్ద వంటా వార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మంకెన అంజిరెడ్డి మాట్లాడుతూ.. స్లాట్ బుకింగ్ విధానంతో కొత్తగా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ఏమీ లేదన్నారు. స్లాట్ బుకింగ్ వల్ల రిజిస్ట్రేషన్ దారులు నానా అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. స్లాట్ బుకింగ్ వల్ల స్టాంప్ పేపర్ ఉండదని, దాంతో స్టాంపు వెండర్ల జీవనోపాధి ఇబ్బందిగా మారుతుందన్నారు. డాక్యుమెంట్ రైటర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం లైసెన్స్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పి ఇప్పటి వరకు ఆ హామీని నిలబెట్టుకోలేదని ఆరోపించారు. వెంటనే లైసెన్స్ విధానాన్ని అమలు చేసి స్లాట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డాక్యుమెంట్ రైటర్లు చేస్తున్న ఆందోళనకు చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్య పంతులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు తాడెం వెంకట స్వామి, రైటర్స్ పచ్చిమడ్ల శ్రీధర్, ఎండీ ఆరిఫ్, అంబాల శ్రీనివాస్, స్వర్గం నవీన్, తాడెం శ్రీనివాస్, ఎర్రమైసగల్ల బుచ్చిబాబు, బండ్ల సంపత్, తుమ్మ కృష్ణ, తాడెం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాద హత్యాకాండ అమానుషం

- జమ్మూ కాశ్మీర్‌లో శాంతి నెలకొల్పాలి : సిపిఎం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

'పర్యాటక ప్రాంతమైన జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద ముష్కరులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 28 మంది అమాయక పౌరులు, పర్యాటకులను అతి క్రూరంగా చంపేశారు. చనిపోయినవారిలో హైదరాబాదు ఇంటలిజెన్స్ బ్యూరోలో పనిచేస్తున్న మనీష్ రంజన్ కూడా ఉన్నారు. ఇది దేశ పౌరులనే కాదు, ప్రపంచ దేశాలను కలచివేసే ఘటన. అమానవీయ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపాన్ని తెలుపుతున్నది. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నది. గాయపడిన 20మంది క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి. ఆప్తులను కోల్పోయిన కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మతంపేరుతో జరుగుతున్న ఇలాంటి ఘటనలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి, మాటలతో సరిపెట్టకుండా అన్ని కోణాలనుంచి దర్యాప్తు చేయాలనీ, దుండగులను న్యాయస్థానం ముందుంచి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో శాంతి నెలకొనేలా, ఇలాంటి ఉగ్రవాద ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించి అక్కడి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.

**ఎఐఐఇఎ ఖండన**

కశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతం పహల్గామ్‌లో అమాయక పర్యాటకులపై జరిగిన హేయమైన ఉగ్రవాద దాడిని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ అధ్యక్షులు వి.రమేష్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత మిశ్రా ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ హింసాత్మక ఘటనలో ఇండోర్ ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్‌గా పని చేస్తున్న సుశీల్ నతానియేల్ సహా 26 మంది అమాయకుల ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దు్ఃఖాన్ని కలిగించిందని తెలిపారు. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

**పర్యాటకులకు నివాళి**

జమ్మూ కాశ్మీర్‌లోని పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకులకు బుధవారం హైదరాబాద్‌లోని బేగంపేటలోని బాలయోగి పర్యాటక భవన్‌లో గల టూరిజం ప్లాజాలో టూరిజం ఆపరేటర్లు ఘనంగా నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. బాధిత కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటువంటి దాడులను ముక్తకంఠంతో ఖండించాలన్నారు.




కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ఈ సందర్భంగా టూరిజం కార్యదర్శి స్మితా సబర్వాల్ మాట్లాడుతూ.. ఇది ఒక అమానీవయ చర్యగా అభివర్ణించారు. ఇది అత్యంత హేయమైన చర్య అన్నారు. ముష్కరులకు నాగరిక సమాజంలో జీవించే అర్హత లేదన్నారు.

**బిసి కమిషన్ కార్యాలయంలో సంతాప సభ**

కశ్మీర్‌లో తీవ్రవాదులు జరిపిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు సంతాపాన్ని తెలుపుతూ బుధవారం హైదరాబాద్‌లో బిసి కమిషన్ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, డిప్యూటీ డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, స్పెషలాఫీసర్ జి. సతీష్, తదితరులు పాల్గొన్ని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తి వెలిగించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జి.నిరంజన్ మాట్లాడుతూ.. ఉగ్రవాదులు 28 పర్యాటకుల్ని హత్యచేయడాన్ని తప్పుబట్టారు.

**యాత్రికులపై దాడి హేయమైన చర్య - ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్**

కాశ్మీర్‌లోని పహల్గాంలో యాత్రికులపై ఉగ్రవాదులు దాడిని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ తీవ్రంగా ఖండించారు. మృతులకు నివాళులర్పిస్తూ... వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జమ్మూకాశ్మీర్‌లో పర్యటించేందుకు వెళ్లిన సందర్శకులను ఉగ్రవాదులు కాల్చి చంపిన ఘటన హేయమైన చర్య అని తెలిపారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ చర్యలను ఖండించాలని పిలుపునిచ్చారు. మిల్ట్రీ దుస్తుల్లో ఉగ్రవాదులు వచ్చారని కథనాలను వెలువడుతున్నాయనీ, మొత్తం ఘటనపై సమగ్రమైన విచారణ చేయడం ద్వారా వాస్తవాలను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. కాశ్మీర్ ఉగ్రవాదుల దాడిని ఆసరాగా చేసుకుని దేశంలో మత విద్వేషాలను సృష్టించే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

**సుందరయ్య పార్క్‌లో క్యాండిల్ ర్యాలీ**

ఉగ్రవాదుల కాల్పులను ఖండించాలని, ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య అని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోటా రమేష్, ఆనగంటి వెంకటేష్ అన్నారు. కాశ్మీర్‌లో ఉగ్రవాద కాల్పులను నిరసిస్తూ బుధవారం డివైఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. మృతిచెందిన పర్యాటకులకు నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కాశ్మీర్ ప్రజలతోపాటు దేశ ప్రజలకు రక్షణ కల్పించడంలో విఫలమైందన్నారు.కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, ప్రాణ నష్టాలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం రక్షణ చర్యలు తీసుకోవాలని, కాశ్మీర్‌లో శాంతి నెలకొల్పాలని అన్నారు.

**ఉగ్రవాదుల దాడి .. కేంద్రం వైఫల్యమే : సిఐటియు**

కేంద్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడి జరిగిందని, పౌరులు ప్రాణం కోల్పోయారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా, మరణించిన టూరిస్టులకు నివాళులర్పిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్‌టిసి ఎక్స్ రోడ్ వరకు క్యాండిల్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలకు, టూరిస్టులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఒకపక్క ఉగ్రవాద దాడి జరిగి అమాయక ప్రజలు మరణించి దేశ ప్రజలందరూ నివాళులర్పిస్తుంటే.. మరోపక్క గోడీ మీడియా, ఆర్ఎస్ఎస్ సోషల్ మీడియా, వాట్సప్ యూనివర్సిటీ గ్రూపులు హిందూ ముస్లిం తగాదాలను రెచ్చగొట్టే పద్ధతిలో పోస్టింగులు పెడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రత్యేక అధికారులను నియమించాలి

- దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్
- కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాల పనుల పరిశీలన

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

మే 15 నుంచి 26 వరకు కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతీ పుష్కర పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. బుధవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వద్ద సరస్వతీ పుష్కర పనులను సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆమె పరిశీలించారు. విఐపి ఘాట్, సరస్వతీ మాత విగ్రహం ఏర్పాటు, 100 గదుల సత్రం పనులు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం ఇఒ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో శాఖల వారీగా చేపట్టిన పనుల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆశించిన స్థాయిలో వేగంగా పనులు జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న పది రోజులు ముఖ్యమని తెలిపారు. సరస్వతీ విగ్రహం ఏర్పాటు, హారతి ప్లాట్‌ఫామ్‌ను మే మొదటి వారం వరకు పూర్తి చేయాలని దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఘాట్, సరస్వతి విగ్రహం, సత్రం పనులు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర పనుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా అధికారులును నియమించాలన్నారు. విఐపి ఘాట్ వద్ద శాశ్వత మరుగుదొడ్లు, షవర్స్, యాత్రికులు బట్టలు మార్చుకునే గదులు, లైటింగ్ పనులను మే పది వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విఐపి ఘాట్ వద్ద అదనంగా తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలని, సాలిడ్ వేస్ట్ తరలించడానికి నాలుగు వాహనాలు సిద్ధంగా ఉంచాలని, ఘాట్ పైన చలువ పందిళ్లు వేయాలని సూచించారు. 100కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటుతో పాటు 125 కెవి జనరేటర్‌ను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఆమె వెంట జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్‌పి కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ఆర్జేసీ రామకృష్ణారావు, విద్యుత్తు శాఖ ఎస్ఈ మల్సూర్ నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ సత్యనారాయణ, డిపిఒ నారాయణ రావు, జిల్లా వైద్యాధికారి మధుసూదన్, దేవాదాయ శాఖ ఈఈ కనక దుర్గాప్రసాద్, పిఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, ఇరిగేషన్ ఈఈ తిరుపతి రావు, ధార్మిక అడ్వైజర్ గోవింద రాజు తదితరులు ఉన్నారు.



## స్వీట్ వన్ షాప్‌లో నటీ అనన్య సందడి

**ప్రజాశక్తి - హైదరాబాద్**

కెపిహెచ్‌బి కాలనీ (9త్) ఫేస్ ఐటెన్షన్ లైన్‌లో ఏర్పాటు చేసిన స్వీట్ వన్ షాప్ ప్రారంభోత్సవంలో సినీ నటి అనన్య సందడి చేశారు. నగరంలో కార్పొరేట్ స్వీట్ షాపులు ఉన్నప్పటికీ ఈ స్వీట్ వన్ షాప్ స్వచ్ఛత, నాణ్యత ప్రమాణాలు ఇక్కడి ప్రత్యేకత అని అనన్య పేర్కొన్నారు. బుధవారం జరిగిన దీని ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అరకపుడి గాంధీ, మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ ప్రముఖులు పాల్గొన్నారు. తాను 30 ఏళ్లుగా క్యాటరింగ్ రంగంలో అపారమైన అనుభవాన్ని ఘడించామని ఆ సంస్థ ఎండి శంకర్ నారాయణ అన్నారు. కార్పొరేట్ స్వీట్ షాపులకు దీటుగా పేద మధ్యతరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని తమ స్వీట్ వన్ షాపులో తక్కువ ధరలకే నాణ్యమైన, స్వచ్ఛమైన, రుచికరమైన స్వీట్లు అందుబాటులో ఉంచామన్నారు. నగరంలో తమకు నాలుగు స్టోర్లున్నాయన్నారు.

## ప్యూర్‌పవర్ గ్రిడ్‌ను ఆవిష్కరించిన ప్యూర్

న్యూఢిల్లీ : ద్విచక్ర విద్యుత్ వాహన రంగంలో ఉన్న ప్యూర్ సంస్థ కొత్తగా బ్యాటరీ ఆధారిత 5 మెగావాట్ గ్రిడ్ స్టోరేజీ ఉత్పత్తి ప్యూర్ పవర్ గ్రిడ్‌ను ఆవిష్కరించింది. ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఈ గ్రిడ్ రెన్యూవబుల్ ఎనర్జీ వనరులను సమగ్రపర్చడాన్ని వేగవంతం చేసేందుకు తోడ్పడనుందని ఆ సంస్థ ప్రతినిధి నిషాంత్ డొంగరి తెలిపారు. దీని కోసం 10కిపైగా దిగ్గజ రెన్యూవబుల్ ఎనర్జీ ఐపిపి సంస్థలు కొనుగోలుకు ముందుకు వచ్చాయని పేర్కొన్నారు. బ్యాటరీ టెక్నాలజీ, పవర్ ఎలక్ట్రానిక్స్‌లో అపార అనుభవంతో శక్తివంతమైన, తెలివైన, తక్కువ ధరకు లభించే గ్రిడ్-స్కేల్ ఉత్పత్తిని తాము రూపొందించామన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

## మలబార్ గోల్డ్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు

హైదరాబాద్ : అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నట్లు ప్రముఖ అభరణాల రిటైల్ చెయిన్ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ వెల్లడించింది. విలువ, నమ్మకం, శ్రేష్టతతో తమ వినియోగదారులకు ఆకర్షణీయ డీల్స్ అందిస్తోన్నట్లు పేర్కొంది. బంగారు ఆభరణాల తరుగు ఛార్జీలపై 25 శాతం వరకు తగ్గింపు, ప్రీషియస్ స్టోన్స్ అండ్ అన్ కట్ డైమాండ్స్ ఆభరణాల తరుగు ఛార్జీలపై, వజ్రాల విలువపై 25 శాతం వరకు తగ్గింపు అందిస్తోన్నట్లు వెల్లడించింది. వినియోగదారులు పెట్టుబడి పెట్టడానికి ఈ పండుగ ఆఫర్లు అసాధారణమైన అవకాశాలను కల్పిస్తున్నాయని పేర్కొంది.

## దక్షిణాదిలో మెర్సిడెస్ బెంజ్ నెట్‌వర్క్ విస్తరణ

హైదరాబాద్ : దక్షిణాదిలో తమ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించినట్లు ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ మెర్సిడెస్ బెంజ్ ఇండియా తెలిపింది. కొత్తగా బెంగళూరు, హైదరాబాద్‌లో మూడు అధునాతన లగ్జరీ సర్వీస్ కేంద్రాలను ప్రారంభించినట్లు ఆ సంస్థ ఎండి, సిఇఒ సంతోష్ అయ్యర్ తెలిపారు. ఈ కీలక మార్కెట్లలోని కస్టమర్లకు మెరుగైన అనుభూతిని అందించడం, కార్యకలాపాలను విస్తరించడంపై తమకున్న నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. ఇప్పటికే పటిష్టంగా ఉన్న బెంగళూరు, హైదరాబాద్ లాంటి కీలక మెట్రో నగరాల్లోనూ తమ బ్రాండ్ పట్ల ఆకర్షణను పెంపొందించడంపై మరింతగా దృష్టి పెడుతున్నామన్నారు. హైదరాబాద్‌లో మహవీర్ 2ఎస్ ఫెసిలిటీలో 12,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త సర్వీసు సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

# భవిష్యత్ పోరాటాలకు వేదిక ఖమ్మం

- 25 నుంచి 27 వరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభలు
- హాజరుకానున్న 600 మంది ప్రతినిధులు
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు

**ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో**

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర 5వ మహాసభలు ఈ నెల 25 నుంచి 27 వరకు ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జరగనున్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు తెలిపారు. బుధవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖమ్మంలో 2002 తర్వాత రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా జరుగుతున్న రాష్ట్ర మహాసభల్లో 33 జిల్లాల నుంచి, 10 రాష్ట్ర యూనివర్సిటీలు, 6 సెంట్రల్ యూనివర్సిటీల నుంచి 600 మంది విద్యార్థి ప్రతినిధులు మూడు రోజులపాటు పాల్గొంటారని తెలిపారు. మొదటిరోజు 25న ఉదయం 11 గంటలకు జడ్‌పి సెంటర్ నుంచి వేలాది మందితో ప్రదర్శన ప్రారంభమవుతుందని, అనంతరం భక్తరామదాసు కళాక్షేత్రంలో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. దీనికి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సభలో ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు విపి సాను, సినీ నటులు మాదాల రవి, ఆహ్వాన సంఘం చైర్మన్ మువ్వా శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మొట్టమొదటిసారి ఖమ్మం జిల్లా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలకు ప్రాతినిధ్యం ఇస్తోందన్నారు. ఈ మహాసభలను ఖమ్మం జిల్లా విద్యార్థులోకం, మేధావులు, విద్యావంతులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దొంతబోయిన వెంకటేష్, నాయకులు వినోద్, లోకేష్, త్రినాథ్, సుశాంత్, జీవన్ పాల్గొన్నారు.

# చేనేతలో 'త్రిఫ్ట్' పథకం అమలు చేయాలి

- వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలి
- తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

చేనేత వృత్తి కార్మికులందరికీ జియో ట్యాగ్ నంబర్ ఇచ్చి త్రిఫ్ట్ ఫండ్ పథకం వర్తింపజేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ ప్రభుత్వాన్ని కోరారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. కార్మికులు ఉపాధి కోల్పోయి.. కష్టానికి తగిన ఆదాయం లభించక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కొందరు వలస బాట పడితే, మరికొందరు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత ముడి సరుకులు, రంగులు, రసాయనాలు, నూలు, పట్టు ధరలు పెరగడంతో కార్మికునికి ఉపాధి కరువైందన్నారు. సహకార సంఘాల ద్వారా తయారు చేసిన బట్టలకు మార్కెట్ సౌకర్యం లేక గుట్టలుగా పేరుకుపోయాయని వివరించారు. పేరుకుపోయిన బట్టల నిల్వలను ప్రభుత్వం కొనుగోలు చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నూలు సబ్సిడీ పథకం నగదు బదిలీ ద్వారా కార్మికుడికి, అనుబంధ కార్మికులకు నెలకు 3000 రూపాయలు అకౌంట్లో జమ చేయాలన్నారు. చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించి టెస్కోకు పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి సంఘాలను బలోపేతం చేయాలని కోరారు. చేనేత కార్మికులకు పెట్టుబడి సాయం కింద రాయితీతో కూడిన కొత్త రుణాలు రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, ఉపాధి కల్పన కోసం ప్రభుత్వరంగ సంస్థలకు ఏకరూప దుస్తులు ఆర్డర్స్ ఇవ్వాలని కోరారు. చేనేత కార్మికులకు ఆరోగ్య బీమా పథకం వర్తింపజేయాలని, హౌస్ కం వర్క్ షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. చేనేత పరిశ్రమ, కార్మికుల ఉపాధి, సంక్షేమం కోసం చేనేత అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి దానికి ప్రత్యేకంగా రెండు వేల కోట్ల రూపాయలు బడ్జెట్లో నిధులు కేటాయించాలన్నారు. చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్‌ను తమ సంఘం ఆధ్వర్యంలో కలిసిన సందర్భంలో చేనేత కార్మికుడితోపాటు వృత్తి అనుబంధ కార్మికులందరికీ జియో టాగ్ అమలు చేస్తామని, రుణమాఫీ అమలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. వెంటనే కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కందగట్ల గణేష్, ఉపాధ్యక్షులు కర్నాటి శ్రీరంగం, సహాయ కార్యదర్శి వనం రాములు, వాలుగొండ మధు, ఏలే శ్రీనివాస్, గడ్డం దశరథ, దయానంద్, ఏలే వెంకటేశం, రావిరాల వెంకటేశం ఉన్నారు.

## రైతు క్షేమం కోసమే భూభారతి చట్టం

- రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో**

రైతు సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో బుధవారం భూభారతిపై అవగాహనా సదస్సులో మంత్రి ప్రసంగించారు. ధరణి చట్టం దొరల స్వార్థం కోసం తెచ్చిన చట్టమన్నారు. ఆ చట్టంలోని లోపాలను సవరించి రైతు సంక్షేమం కోసం భూభారతి తీసుకొచ్చామన్నారు. ఒక రైతుకు ఉన్న ఆరు ఎకరాల భూమికి ధరణి చట్టం రాకముందు అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే లబ్దిని పొందారని, ధరణి వచ్చాక భూమే తన పేరు మీద లేకుండాపోయిందని అన్నారు. ఇలా అనేక మంది రైతులకు సమస్యలు ఉన్నాయన్నారు. వంశ పారంపర్యంగా వచ్చిన భూమి గతంలో రికార్డులో, పట్టాదారి పుస్తకంలో ఉన్నప్పటికీ ధరణి చట్టంతో ఆన్‌లైన్ రికార్డులు కనపడక రైతులు అధికారులు, కోర్టుల చుట్టూ తిరిగి అలసిపోయారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో భూభారతి చట్టంపై కోదండరెడ్డితో ఒక కమిటీ వేసినట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో వచ్చిన రెండు లక్షల 46వేల దరఖాస్తులను, ప్రస్తుత మూడున్నర లక్షల దరఖాస్తులను ఏడాది నాలుగు నెలల్లోనే పరిష్కరించినట్టు చెప్పారు. గతంలో ఒక్క కలెక్టర్‌కే ఉన్న అధికారాలను విభజించి తహసీల్దార్, ఆర్డీవోకు విభజించామని, అధికార వికేంద్రీకరణ చేశామని తెలిపారు. 18 రాష్ట్రాలకు అధికారులను పంపి అధ్యయనం చేయించిన తర్వాత ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చామన్నారు. పేదవాడికి ఉపయోగపడే విధంగా రెవెన్యూ అధికారులు పనిచేయాలని సూచించారు. రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి పారదర్శకంగా రైతులకు భూపట్టాలను ఇవ్వాలన్నారు. ప్రతి అధికారీ దాదాపు రైతు కుటుంబం నుండే వచ్చారు కాబట్టి ఆ బాధ వారికి తెలుసు అని అన్నారు. ఉద్దేశపూర్వకంగా ఏ రెవెన్యూ అధికారి తప్పు చేసినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మండలంలో ఉన్న జన్నారెడ్డి ప్రతాపరెడ్డి భూమిని 70 ఏండ్ల కిందట కొనుగోలు చేసి.. రికార్డులో, కబ్జాలో ఉన్న ప్రతి రైతుకూ పట్టాలు చేయడం కోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఆ అంశాలను తమ దగ్గరికి పంపాలని కలెక్టర్‌ను ఆదేశించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే కోరిక మేరకు నియోజకవర్గానికి 3500 ఇండ్లతో పాటు దశలవారీగా ఇంకా ఎక్కువ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామెల్, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మెన్ తీగల గిరిధర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందన్ లాల్‌పవార్, ఎస్పీ నరసింహ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ నాగం జయసుధ, తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీవో సునీత, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.




## హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమిద్దాం

- అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి

**ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో**

అంగన్‌వాడీల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమిద్దామని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి పిలుపునిచ్చారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం కొడకండ్ల ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు వివిధ యూనియన్ల నుంచి దాదాపు 200 మంది యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి సంఘం కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలను బలహీనపరచడం కోసమే పీఎం శ్రీ పథకం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని ఆరోపించారు. దీనిద్వారా ఐసిడిఎస్ నిధులను దారి మళ్లించి, క్రమక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాలను రద్దు చేసే కుట్ర పన్నుతున్నారని అన్నారు. జీఓ 14ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల కృషి ఫలితంగా దేశంలో పౌష్టికాహార లోపం తగ్గుదల, బాలింతల జబ్బుల నివారణ, పోలియో నివారణ వంటి వాటిల్లో అద్భుత ప్రగతిని సాధిస్తుందన్నారు. అలాగే, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే పూర్వ ప్రాథమిక విద్య కొనసాగిస్తున్నారని తెలిపారు. వాటిని మరింత సమర్ధవంతంగా నిర్వహించడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. ఐసిడిఎస్ పరిరక్షణ, అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం కోసం సిఐటియు నిరంతరం కృషి చేస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకే యాప్‌ను అమలు చేయాలని, మినీ టీచర్స్‌కు పెండింగ్‌లో ఉన్న 11 నెలల వేతనం విడుదల చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి రాజకీయ నాయకుల వేధింపులు రోజురోజుకు తీవ్రమవుతున్నాయని ఆరోపించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన గుడ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్ పెంచాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పక్కా భవనాలు, మరుగుదొడ్ల సౌకర్యం, రికార్డులు భద్రపరచుకోవడానికి బీరువాలు తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెల సెలవులు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు యాటాల సోమన్న, జిల్లా అధ్యక్షులు రాపర్తి రాజు, జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్, జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న, మహబూబాబాద్ ప్రాజెక్టు జిల్లా సహాయ కార్యదర్శి స్వరూప, సరిత, భాగ్య, బి శోభారాణి, మంగ, భారతి, ఇందిరా, యాదమ్మ, ఉప్ప లక్ష్మి, మాధవి, శోభ తదితరులు పాల్గొన్నారు.

## మే 22 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- ఫీజు చెల్లించేందుకు చివరి తేది ఏప్రిల్ 30
- ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహణ
- తెలంగాణ ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల టైం టేబుల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. మే 22 నుంచి 29 వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఓ ప్రకటనలో తెలిపారు. ఒకేషనల్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు సైతం ఇదే టైం టేబుల్ వర్తిస్తుందని పేర్కొన్నారు. జూన్ మూడు నుంచి ఆరు వరకు రెండు సెషన్లలో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జూన్ మూడున ఇంటర్ మొదటి సంవత్సరం, 10న ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఏప్రిల్ 30 వరకు సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఇచ్చినట్టు తెలిపారు.

**ఇంటర్ మొదటి సంవత్సర టైం టేబుల్**

మే 22 సెకండ్ లాంగ్వేజ్ పేపర్ -1
మే 23 ఇంగ్లీష్ పేపర్ -1
మే 24 మ్యాథ్స్ పేపర్ 1ఎ, బాటని పేపర్ -1, పొలిటికల్ సైన్స్ పేపర్ -1
మే 25 మ్యాథ్స్ పేపర్ 1బీ, జువాలజీ పేపర్ -1, హిస్టరీ పేపర్ -1
మే 26 ఫిజిక్స్ పేపర్ -1, ఎకానమిక్స్ పేపర్ -1
మే 27 కెమిస్ట్రీ పేపర్ -1, కామర్స్ పేపర్ -1
మే 28 పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ -1, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్ పేపర్ -1
మే 29 మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్ -1, జియోగ్రఫీ పేపర్ -1

ఇంటర్ ద్వితీయ సంవత్సరం టైం టేబుల్

మే 22 సెకండ్ లాంగ్వేజ్ పేపర్ -2
మే 23 ఇంగ్లీష్ పేపర్ -2
మే 24 మ్యాథ్స్ పేపర్ 2ఎ, బాటని పేపర్ -2, పొలిటికల్ సైన్స్ పేపర్ -2
మే 25 మ్యాథ్స్ పేపర్ 2బీ, జువాలజీ పేపర్ -2, హిస్టరీ పేపర్-2
మే 26 ఫిజిక్స్ పేపర్ -2, ఎకానమిక్స్ పేపర్ -2
మే 27 కెమిస్ట్రీ పేపర్ -2, కామర్స్ పేపర్ -2
మే 28 పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ -2, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్ పేపర్ -2
మే 29 మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్ -2, జియోగ్రఫీ పేపర్ -2